# జగనన్న సురక్షతో సంక్షేమ రాజ్యం

● ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి





రాయదుర్గం: మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి , ఉరవకొండ: సీఎం జగన్ ప్రసంగాన్ని వీక్షిస్తున్న డీడీ కొఠారి, ఇతర ప్రజాప్రతినిధులు

రాయదుర్గం: రాజ్యాంగ స్ఫూర్తికి నిదర్శనంగా.. ఏపీలో సంక్షేమ రాజ్యం కొనసాగుతోందని, పేదరికం నుంచి గట్టెక్కించేందుకే సీఎం జగన్ దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో మాత్రమే విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం 'జగనన్న సురక్ష' కార్యక్రమం పై తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పట్టణంలోని పాత మీసేవా కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్కీన్ నుం,ఇ సీఎం ప్రసంగాన్ని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, ఎంపీడీఓ కొండన్న, గ్రీవెన్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు గౌని కాంతారెడ్డి, కౌన్సిలర్లు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గృహసారథులతో కలసి విప్ వీక్షించారు. అనంతరం విప్ మాట్లాడారు.. అర్హత ఉన్న వారందరికీ సంక్షేమ పథకాలు చేర్చాలన్నదే సీఎం జగన్ లక్ష్యమన్నారు. అందులో పుట్టుకొచ్చిందే 'జగనన్న సురక్ష' కార్యక్రమమని, ఇది సంపూర్ణంగా క్షేత్రస్థాయిలో అమలుచేయగలిగితే పేదరికం లేని రాష్ట్రంగా, అభివృద్ధిలో నెంబర్-1గా ఉంటామన్నారు. పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని 'జగనన్న సురక్ష' లాంటి గొప్ప పథకాన్ని సీఎం జగన్ అమల్లోకి తీసుకొచ్చారని, దీన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, గృహసారథులు విజయవంతం చేయాలన్నారు. వారం రోజుల పాటు ఇంటింటికీ తిరిగి అర్హులను గుర్తించాలన్నారు. ఆ తర్వాత సచివాలయాలకెళ్లి క్షేత్రస్థాయిలో గుర్తించిన అంశాలను రిజిష్టర్‌లో నమోదు చేసి లబ్ధిదారులకు టోకెన్లు అందించాలన్నారు. జూలై 1 నుంచి మండల స్థాయి అధికారుల సమక్షంలో ప్రతి సచివాలయం పరిధిలో నిర్వహించే ప్రత్యేక క్యాంపులు సద్వినియోగం చేసుకునేలా చైతన్యం తీసుకురావాలన్నారు. అనంతరం ఎలాంటి సర్వీసు చార్జీలు లేకుండానే 11 రకాల ధ్రువీకరణ పత్రాలు క్యాంపు వద్దే జారీ చేసేలా కార్యచరణ చేపట్టాలన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ ప్రవాహంలో 'టీడీపీ' నామరూపాల్లేకుండా కొట్టుకుపోతుందన్నారు. పేదల ద్రోహి, విలువల్లేని వ్యక్తి చంద్రబాబు అని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గౌని లావణ్య, శ్రీనివాసరెడ్డి, వార్డు ఇన్‌చార్జులు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్: అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అందాలనే సదుద్దేశ్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శుక్రవారం ''జగనన్న సురక్ష'' కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కొండయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన వీసీలో మండలస్థాయి అధికారులు తిలకించారు. అలాగే రాతిబావివంక (బొందనకల్లు) లో తహసీల్దార్ మారుతి , గ్రామంలోని 12 సచివాలయాల్లో ఆయా గ్రామాల సచివాలయ ఉద్యోగులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు , వలంటీర్లు, గృహసారథులు వీక్షించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శివారెడ్డి, ఏఓ మహేంద్ర, ఎంఈఓ-2 వెంకట రమేష్ , ఏపీఓ నీరజ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిష్టాత్మకంగా చేపట్టాలి

ఉరవకొండ: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని ప్రత్యేక అధికారిణి, బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బుకొఠారి పిలుపు చ్చారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం పై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన లైవ్ టెలికాస్ట్ కార్యక్రమాన్ని బీసీ వెల్ఫేర్ డీడీతో పాటు ఎంపీడీఓ చంద్రమౌళి, ఎంపీపీ చంద్రమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, సర్పంచ్ లలితమ్మ వీక్షించారు. డీడీ మాట్లాడుతూ జూన్ 24 నుంచి వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, ప్రతి ఇంటినీ సందర్శించి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

కూడేరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న సురక్ష లాంచింగ్ లైవ్ టెలికాస్ట్‌ను ఎంపీపీ నారాయణరెడ్డి, ఎంపీడీఓ ఎంకే బాషా, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పలుశాఖల అధికారులు వీక్షించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దేవ తదితరులు పాల్గొన్నారు.

విడపనకల్లు: మండలంలోని గడేకల్లు రైతు భరోసా కేంద్రంలో అధికారులు, ప్రజాప్రతినిధులు జగనన్న సురక్ష పథకంపై సమావేశం నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి సందే శాన్ని తిలకించారు. కార్యక్రమంలో ఎంపీపీ కరణం పుష్పావతి, ఎంపీటీసీ ఓబుళేసు,మాజీ సర్పంచు భీంరెడ్డి, అధికారులు, ప్రజా ప్రతినిధులు సర్పంచులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: బెళుగుప్ప సచివాలయం-2లో జగనన్న సురక్ష పథకాన్ని లైవ్‌లో ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న, సర్పంచ్ సాలిబాయి, ఉప సర్పంచ్ పాతన్న, ఎంపీటీసీలు ఈశ్వర్, శకుంతలాబాయి, పంచాయతీ సెక్రటరీ వెంకటేశులు, సుధాకర్‌నాయక్, ఎంఎల్‌ఓ తిమ్మారెడ్డి, సచివాలయ అధికారులు, వీక్షించారు. అలాగే రామసాగరం గ్రామంలో సర్పంచ్ రామకృష్ణమ్మ, రమనేపల్లిలో సర్పంచ్ రమేష్, తగ్గుపర్తిలో వైస్ ఎంపీపీ పుష్పావతి తదితరులు పంచాయతీ అధికారులతో కలసి జగనన్న సురక్ష పథకాన్ని లైవ్‌లో సీఎం ప్రసంగాన్ని వీక్షించారు.

బ్రహ్మసముద్రం: మండలకేంద్రంలోని రైతుభరోసా కేంద్రంలో జగనన్న సురక్ష పథకం ప్రారంభోత్సవం లైవ్ టెలికాస్టు కు మండల అధికారులు హాజరయ్యారు. ఎంపీడీఓ దాసానాయక్, తహసీల్దార్ బాలకిషన్, జెడ్పీటీసీ సభ్యురాలు ప్రభావతి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరయ్యారు

## క్లుప్తంగా

### మార్మోగిన ముత్యాలమ్మ నామస్మరణ



అలంకరణలో ముత్యాలమ్మ

కూడేరు: మండలంలోని జల్లిపల్లిలో శుక్రవారం ముత్యాలమ్మ దేవి అమ్మవారి నామస్మరణ మార్మోగింది. అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి 41 రోజులు పూర్తి కావడంతో గ్రామస్తులంతా కలిసి మండల పూజను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి తొలుత క్షీరాభిషేకం చేసి, అనంతరం పట్టు వస్త్రాలు , పుష్పాలతో విశేషంగా అలంకరించారు. గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.గ్రామం సుభిక్షంగా ఉండేలా చూడు తల్లీ అంటూ వేడుకున్నారు. బంధువులు, మిత్రులు తరలిరావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

### ఏఓగా సాయికుమార్



బొమ్మనహాళ్: మండల వ్యవసాయాధికారిగా సాయికుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏఓగా పనిచేస్తున్న అహమ్మద్‌బాషా రాయదుర్గం వ్యవసాయ ల్యాబ్‌కు బదిలీ అయ్యారు. ఆ స్థానంలో పదోన్నతిపై సాయికుమార్ బాధ్యతలు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు విక్రయం జరగకుండా చర్యలు తీసుకుంటానన్నారు.

### 'నవోదయ'కు ఎంపిక



యోగేశ్వర్



చరణ్య

ఉరవకొండ: లేపాక్షి నవోదయ ప్రవేశ పరీక్షల్లో ఉరవకొండ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఆరో తనగతి ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్షలో పట్టణానికి చెందిన యోగేశ్వర్, ఆర్.చరణ్య మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. ఈసందర్భంగా శిక్షకుడు వెంకటరమణను ప్రతిభ స్టడీ సర్కిల్ నిర్వాహకులు, విద్యార్థుల తల్లిదండ్రులు సత్కరించారు.

### విద్యార్థుల భవితకు బాటలు

కూడేరు: విద్యార్థుల బంగారు భవితకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలు అమల్లోకి తీసుకువచ్చి బాటలు వేస్తున్నారని వైస్ ఎంపీపీ సుబ్బమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక ద్వారా నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### మహోన్నత దేశభక్తుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ

రాయదుర్గంటౌన్: దేశ రాజకీయ వ్యవస్థపై చెరగని ముద్ర వేసిన భారతీయ జనతా పార్టీ మూల పురుషుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ మహోన్నత దేశభక్తుడు అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జింకా వసుంధర, పట్టణ అధ్యక్షుడు వాడేకర్ అంభోజీరావు తెలిపారు. శుక్రవారం శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని పట్టణంలోని శాంతినగర్‌లో ఉన్న బీజేపీ కార్యాలయంలో నిర్వహించారు. బీజేపీ నాయకులు ప్రకాష్, తిప్పయ్య, రవికుమార్, విష్ణుకుమార్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

### ఓటరు జాబితాలపై సమీక్ష

బెళుగుప్ప: ఓటరు జాబితాకు సంబంధించి ప్యూరిఫికేషన్ ఎలక్టోరల్ రోల్స్‌పై బీఎల్‌ఓలతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ ఓబులేసు సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా ఓటరు జాబితాలో జంక్ ఓటర్స్ 256, 263 హౌస్ హోల్డ్స్ ఓటర్లు ఉన్నారని, బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి వాటిని సరిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ హుస్సేన్ పీరా, ఆర్‌ఐ నగేష్, వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

### పండ్ల తోటల పెంపకంపై విద్యార్థులకు అవగాహన



మామిడి తోటను పరిశీలిస్తున్న డిగ్రీ విద్యార్థులు

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్స్ విద్యార్థులకు పండ్ల తోటల పెంపకంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించేందుకు అధ్యాపకులు శుక్రవారం పలు గ్రామాల్లో సాగు చేస్తున్న పంటలను చూపించారు. మండలంలోని రాకెట్ల గ్రామంలో ఆదర్శ రైతు నెట్టెం రమణ 20 ఎకరాల్లో సాగు చేస్తున్న మామిడి, అల్లనేరుడు, ఉసిరి పంటలను ప్రిన్సిపాల్ రామకృష్ణ, వృక్షశాస్త్ర విభాగం అధిపతి కె.వై.నారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులు పరిశీలించారు. అనంతరం రైతు రమణ విద్యార్థులతో తన అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ హనమంతరెడ్డి, రమేష్, ప్రశాంత్, నారాయణస్వామి పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాల తనిఖీ

కూడేరు: మండలంలోని రామచంద్రాపురం, అరవకూరు గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను విద్యాధికారి-2 సాయికృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది, విద్యార్థుల హాజరుకు సంబంధించిన రిజిష్టర్లను పరిశీలించారు. పిల్లలకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని అందేలా చర్యలు చేపట్టాలని హెచ్‌ఎంలకు సూచించారు. అలాగే విద్యలో వెనుకబడిన విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేసి విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నారు.

## 'ఐటీఐ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి'

రాయదుర్గంటౌన్: విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న నియోజకవర్గంలోని ప్రైవేటు ఐటీఐ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని భారత్ ఐటీఐ కళాశాల ఎదుట నిరసన తెలిపారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకుని విద్యార్థులకు న్యాయం చేయకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు అభిషేక్, అరవింద్, మధు, ఎస్ఎఫ్ఐ నాయకులు వంశీ, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

## తక్షణ సాయం పంపిణీ

రాయదుర్గంటౌన్: వైఎస్సార్ బీమా పథకం పేదలకు అండగా ఉంటుందని మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస యాదవ్, కౌన్సిలర్ పెద్ద వన్నూరుస్వామి అన్నారు. పట్టణంలోని 13వ సచివాలయం పరిధిలోని 22వ వార్డులో అనారోగ్యంతో నాయకుల ఎర్రిస్వామి గురువారం మృతి చెందగా వైఎస్సార్ బీమా కింద రూ.10 వేలు తక్షణ సాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. మిగతా రూ.90 వేలు నామినీ ఖాతాకు జమ అవుతుందన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ ముస్తాక్, కౌన్సిలర్లు డిష్ గోవిందు, మంజునాథ, వార్డు ఇన్‌చార్జ్‌లు సునార్ ఇస్మాయిల్, గంగాధర్, సచివాలయ సిబ్బంది అనురాధ, గోవర్ధన్, హనుమక్క, వలంటీర్లు పాల్గొన్నారు.

# చీడపీడలపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న జిల్లా వనరుల కేంద్రం డీడీ మద్దిలేటి

రాయదుర్గం రూరల్: పంటలకు ఆశించే చీడపీడలు, నివారణకు వాడాల్సిన క్రిమిసంహారక మందులు, యాజమాన్య పద్ధతులపై ఫర్టిలైజర్స్ వ్యాపారులు కూడా అవగాహన ఉండాలని జిల్లా వనరుల కేంద్రం డీడీ మద్దిలేటి సూచించారు. స్థానిక డ్వామా కార్యాలయంలో ఏడీఏ లక్ష్మానాయక్ అధ్యక్షతన నిర్వహించిన దుకాణదారుల అవగాహన కార్యక్రమానికి ఆయనతో పాటు సీనియర్ శాస్త్రవేత్త ఆదినారాయణ హాజరయ్యారు. డీడీ మాట్లాడుతూ ఫర్టిలైజర్ దుకాణం యజమానులకు పంటల సాగు, చీడపీడలు, భూసార పరిస్థితులు తెలిసి ఉంటే రైతులకు ఎలాంటి మందులు ఇవ్వాలో తెలుస్తుందన్నారు. త్వరలో ఫర్టిలైజర్స్ దుకాణదారులకు ప్రభుత్వం సంవత్సరం పాటు శిక్షణ ఇవ్వడానికి సన్నద్ధం అయిందన్నారు. 48 వారాల పాటు ప్రతి ఆదివారం నిర్వహించే శిక్షణకు డీలర్లు హాజరు కావాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏఓ మహేంద్ర, వివిధ మండలాల నుంచి వచ్చిన 40 మంది ఫర్టిలైజర్స్ డీలర్లు పాల్గొన్నారు.

## చురుగ్గా సీసీ రోడ్ల నిర్మాణం



సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టిన దృశ్యం

ఉరవకొండ రూరల్: మండలంలోని నెరమెట్ల గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఉపాధి పథకం కింద గ్రామానికి 2022-23 సంవత్సరానికి సీసీ రోడ్ల నిర్మించడానికి ప్రభుత్వం రూ. 25 లక్షలు మంజూరు చేసింది. నాలుగు రోజులుగా జరుగుతున్న పనులను శుక్రవారం సర్పంచ్ యోగేంద్రరెడ్డి పరిశీలించారు. సీసీ రోడ్లు నాణ్యతగా వేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు.

## నట్టల నివారణ టీకా పంపిణీ

బెళుగుప్ప: నట్టల నివారణ మందును మేకలు, గొర్రెలకు వేయించడం మూలంగా వాటిలో రోగ నిరోధక శక్తిని పెంపొందింప చేయవచ్చని మండల పశువైద్యాధికారి రమేష్ సూచించారు. శుక్రవారం మండలంలోని బెళుగుప్ప తండా గ్రామంలో ఉచిత సామూహిక నట్టల నివారణ కార్యక్రమాన్ని సర్పంచ్ సాలిబాయి, ఎంపీటీసీ ఈశ్వర్, ఉప సర్పంచ్ పాతన్న, నాయకులు గాంగ్యానాయక్‌తో కలసి ఆయన ప్రారంభించారు. ఈ నెల 30 వరకూ అన్ని గ్రామాల్లోనూ సామూహిక నట్టల నివారణ కార్యక్రమం నిర్వహిస్తామని, జీవాల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. అలాగే ప్రీమియం చెల్లించి పశు బీమా పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## 26న మున్సిపల్ సమావేశం

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పురపాలక సంఘంలోని కౌన్సిల్ హాల్‌లో 26వ తేదీ ఉదయం 10.30 గంటలకు కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. సమావేశంలో పట్టణంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలతోపాటు ప్రజా సమస్యలపై చర్చిస్తామన్నారు. కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు, విభాగాలవారీగా అధికారులు హాజరుకావాలని ఆమె కోరారు.

## షార్ట్ సర్క్యూట్‌తో ఫ్రిడ్జ్, ఇన్వర్టర్లు దగ్ధం

బొమ్మనహాళ్: మండల కేంద్రంలో గురువారం రాత్రి విద్యుత్ స్తంభానికి ఉన్న వైర్లు షార్ట్ సర్క్యూట్ వల్ల కిష్టప్ప, గోపాల్ , నెట్టేప్ప ఇళ్లలో మిక్సీ, ఫ్రిడ్జ్, కూలర్, ఇన్వర్టర్లు దగ్ధమయ్యాయి. స్తంభానికి విద్యుత్ తీగలు కిందకు వేలాడుతుండడంతో ఒకటికొకటి తగులుకొని ప్రమాదం చోటుచేసుకుందని బాధితులు వాపోయారు. విద్యుత్ అధికారులకు గతంలో చెప్పినా పట్టించుకో లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి కిందకు ఉన్న వైర్లను పైకి లాగాలన్నారు.

## ప్రార్థనా మందిరం ప్రారంభం

కుందుర్పి: మండలంలోని కరిగానిపల్లిలో శుక్రవారం క్రైస్తవుల నూతన ప్రార్థనా మందిరాన్ని రాష్ట్ర ఉత్తమ సామాజిక సేవా అవార్డు గ్రహీత, జిల్లా పాస్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా కిషోర్ తదితరులు ప్రారంభించారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం చర్చ్ సెక్రటరీ రాజేష్, పాస్టర్లు విజయ్‌కుమార్, ప్రసాద్, అజర్య, క్రైస్తవులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ఒలింపిక్ డేపై ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు గ్రామంలో శుక్రవారం జెడ్పీ ఉన్నత పాఠశాల పీడీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో విద్యార్థులు, పోలీసు సిబ్బంది అంతర్జాతీయ ఒలింపిక్ డేపై ర్యాలీ నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. హెచ్‌ఎం సర్వమంగళం, పోలీసుల సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# జనరంజక పాలనకు జనం జేజేలు



ఉద్దేహాళ్‌లో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

బొమ్మనహాళ్: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జనరంజక పాలన సాగిస్తున్నారని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందడంతో గడప గడపలో జనం జేజేలు పలుకుతున్నారని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని దేవగిరి క్రాస్, ఉద్దేహాళ్ గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాలతో ఇంటింటికీ సంక్షేమ పథకాల లబ్ధి అందజేస్తున్నారన్నారు. టీడీపీ ఉనికిని కాపాడుకునేందుకు చంద్రబాబు అండ్ కో ప్రయత్నం చేస్తున్నారని, మోసపూరిత మేనిఫెస్టోతో ప్రజలను మోసగించేందుకు మరోసారి సిద్ధమవుతున్నారన్నారు. చంద్రబాబు మాటలు నమ్మి మోసపోవద్దని, మీ మంచి కోరి ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగనన్నను ఎప్పటికీ మరిచిపోవద్దని కోరారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ రమేష్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, కోటేశ్వర రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, వన్నూరుస్వామి, రామాంజనేయరెడ్డి, పరమేశ్వర, పెద్దిరెడ్డి, డాక్టర్ బసప్ప, వన్నల్లి రామాంజినేయులు, వీరన్నగౌడ్, జయరామ్ రెడ్డి, కోత్తూరు తిమ్మప్ప, కృష్ణ, తిప్పేస్వామి, శీన, చంద్ర, మాబుసాబ్ తదితరులు పాల్గొన్నారు.

# 'నాడు-నేడు' పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంఈఓలు నాగమణి, వెంకటరమేష్

రాయదుర్గంటౌన్: మన బడి నాడు-నేడు కార్యక్రమం కింద రాయదుర్గం అర్బన్, రూరల్ పరిధిలో మంజూరైన పాఠశాలల్లో గడువులోపు అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఎంఈఓలు నాగమణి, వెంకటరమేష్ సూచించారు. హెచ్‌ఎంలతో మండలవిద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. నాడు-నేడు పనులు పాఠశాలల్లో ఏఏ దశల్లో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. మొదటి విడతలో పనులు చేపట్టిన పాఠశాలలతోపాటు రెండో విడతలో జరుగుతున్న పనులు జూన్ 30లోగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. పనుల్లో ఏవైనా ఇబ్బందులు తలెత్తితే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే ప్రతి విద్యార్థికీ విద్యా కానుక అందజేయాలన్నారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పించి అడ్మిషన్లను పెంచాలన్నారు.

## అనాథ పిల్లలకు ఆర్డీటీ అండ

కంబదూరు: మండలంలోని జెక్కిరెడ్డిపల్లికి చెందిన గొల్ల కామాక్షి గొల్ల ప్రేమనాథ్ దంపతులు 2019లో మరణించారు. వారి ముగ్గురు పిల్లలు పల్లవి, సృజన, చరణ్ అనాథలుగా మారారు. తల్లిదండ్రులు మరణించినప్పటి నుంచి వారు జీవించడం కష్టతరమైంది. విషయం తెలుసుకున్న కంబదూరు జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలరాజు అనంతపురంలో ఉన్న ఫీల్డ్ కార్యాలయంలో ఆర్డీటీ డైరెక్టర్ మాంచో ఫెర్రర్‌ను కలిసి అనాథ పిల్లల విషయం గురించి వివరించారు. స్పందించిన ఆయన పిల్లలకు అండగా నిలుస్తామని తెలియజేసినట్లు వారు తెలిపారు. పిల్లల చదువుకు అయ్యే ఖర్చు, వారి ఆలనాపాలన మొత్తం ఆర్డీటీ కల్పిస్తుందని మాంచో ఫెర్రర్ భరోసా కల్పించారన్నారు. అడిగిన వెంటనే అనాథ పిల్లలకు సహాయం చేయడానికి ముందుకు వచ్చిన మాంచో ఫెర్రర్‌కు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

## హెచ్‌ఎంకు సన్మానం

బెళుగుప్ప: మండలంలోని దుద్దేకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మల్లికార్జున ఇటీవల బదిలీ కావడంతో.. పాఠశాల ఉపాధ్యాయులతో కలసి గ్రామస్తులు శుక్రవారం పాఠశాలలో ఆయనను ఘనంగా సన్మానించారు. అలాగే నూతన హెచ్‌ఎంగా బాధ్యతలు చేపట్టిన బాల మురళి కృష్ణను స్వాగతించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెద్దన్న, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, సర్పంచ్ రత్నమ్మ పాల్గొన్నారు.

## పశువులకు బీమా చేయించండి

కుందుర్పి: రాష్ట్ర ప్రభుత్వం మూగజీవాలకు అందిస్తోన్న పశు బీమాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యుడు ప్రసాద్ సూచించారు. శుక్రవారం కుందుర్పిలో రైతులకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువిజ్ఞాన బడి నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వం పశువులు, గొర్రెలు, మేకలకు అందిస్తున్న సబ్సిడీలు, బీమా, రోగాల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రాధాస్వామి, సర్పంచ్ మారుతేశ్వరి, పార్టీ మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

# పట్టుబడిన 'చోరీ' బంగారం..!

● బంగారు దుకాణాల్లో కర్ణాటక పోలీసుల సోదాలు
● బెంగళూరులో తీగ లాగితే రాయదుర్గంలో కదిలిన డొంక

రాయదుర్గం: కర్ణాటక రాజధాని బెంగళూరు సిటీ పరిధిలోని యలహంక ప్రాంతంలో నెల క్రితం చైన్‌స్నాచింగ్ భారీ స్థాయిలోనే జరిగింది. అక్కడ చోరీ చేసిన దొంగలను ఇటీవల సీసీ పుటేజీల ఆధారంగా ఆ రాష్ట్ర పోలీసులు పట్టుకున్నారు. బంగారం ఏఏ ప్రాంతాల్లో ఎవరెవరికి అమ్మకాలు చేపట్టారనే కోణంలో విచారణ చేపట్టడంతో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. అక్కడ తీగ లాగితే సరిహద్దు ప్రాంతమైన రాయదుర్గంలో డొంక కదలింది. శుక్రవారం రాత్రి యలహంక సీఐ సుందర్ ఆధ్వర్యంలో ఆ రాష్ట్ర పోలీస్ బృందం రాయదుర్గంలో పర్యటించింది. దొంగలిచ్చిన సమాచారం ఆధారంగా ఏకకాలంలో పట్టణంలోని రెండు దుకాణాల్లో సోదాలు చేపట్టారు. ఓ మహిళ మెడలో చోరీ అయిన మంగళ సూత్రం అర్ధభాగం పోలీసుల వద్ద .. అమ్మకం చేపట్టిన దుకాణంలో మిగిలిన సగం చైన్ మ్యాచ్ అయినట్టు గుర్తించారు. దీంతో చోరీ బంగారం ఇక్కడే లావాదేవీ జరిగిందనే నిర్ధారణకు వచ్చినట్టు సమాచారం. రెండు దుకాణాల్లోనూ సుమారు 20 తులాలకు పైగా బంగారం తనిఖీల్లో వెలుగుచూసినట్టు విశ్వసనీయ సమాచారం. ఓ దుకాణంలో రూ.3.20 లక్షలకు కొంత బంగారం కొన్నట్టు విచారణలో వెల్లడైంది. దొంగలు తెచ్చిన సొమ్ము కావడంతో తక్కువ ధరకే కొనుగోలు చేసి ఎక్కువకు అమ్ముకోవచ్చనే అత్యాశకు వెళ్లి మోసపోయినట్టు యజమానులు ఆందోళన వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. తనిఖీలు పూర్తయ్యాకే వివరాలు వెల్లడిస్తామని సీఐ సుందర్ మీడియాకు స్పష్టంచేశారు.

### సూత్రధారులు ఎవరు..?

కర్ణాటకలో దోపిడీకి గురైన బంగారాన్ని రాయదుర్గంలో విక్రయించేలా మధ్యవర్తిత్వం నడిపిన సూత్రులు ఎవరనే కోణంలోనూ పోలీసులు విచారణ చేపట్టారు. శనివారం ఉదయం లోగా వారిని కూడా అదుపులోకి తీసుకుని ఇంకా ఎక్కడెక్కడా అమ్మకం చేయించారు..? వీరు కాదని మరో ముఠా సభ్యులెవరైనా మిమ్మల్ని సంప్రదించారా..? అనే కోణంలో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. దీంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నట్టు తెలుస్తోంది. దుకాణాల వద్ద తనిఖీలు చేపట్టే సమయాన ప్రజలు పెద్దఎత్తున గుమిగూడడంతో ఈ విషయం పట్టణంలో ఎటుచూసి తీవ్ర చర్చనీయంశంగా మారింది.

## విద్యార్థినికి గాయాలు

తాడిపత్రి: పట్టణ సమీపంలోని మైనార్టీ కేజీబీవీకి చెందిన ఇంటర్ విద్యార్థిని శుక్రవారం రాత్రి కేజీబీవీ నుంచి గోడ దూకి ఇంటికి పారిపోబోయే క్రమంలో ప్రమాదవశాత్తు కింద పడి గాయాలపాలైంది. వివరాలు..పెద్దవడుగూరు మండలం చిన్నవడుగూరుకు చెందిన విద్యార్థిని మైనార్టీ కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరింది. శుక్రవారం మధ్యాహ్నమే సదరు విద్యార్థిని తల్లిదండ్రులు పాఠశాలలో వదిలిపెట్టి వెళ్లారు. అయితే సదరు విద్యార్థి ఇంటిపై బెంగతో రాత్రి సుమారు 9 గంటల ప్రాంతంలో పాఠశాల పారిపోయేందుకు గోడను దూకే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు కిందపడి గాయాలపాలైంది. ఎస్ఓ పద్మావతి సిబ్బందితో కలసి విద్యార్థినిని ఆటోలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ నాగరాజు తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు.

## ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా వెంకటనాయుడు



కుందుర్పి: కుందుర్పి ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా వెంకటనాయుడు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీఓ నారాయణస్వామి వైఎస్సార్ జిల్లాకు బదిలీపై వెళ్లడంతో బ్రహ్మసముద్రం ఈఓఆర్‌డీ వెంకటనాయుడుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. కాగా ఆయనకు గతంలో కుందుర్పిలో పనిచేసిన అనుభవం ఉంది.

# ఇదేం 'సమాచారం'!



వైకేపీ కార్యాలయం సమాచార బోర్డులో పాత ఏపీఎం పేరే ఉన్న దృశ్యం

కూడేరు: స్థానిక వైకేపీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సమాచార హక్కు బోర్డులో అధికారులు మారినా పాత అధికారుల పేర్లే దర్శన మిస్తున్నాయి. బదిలీపై వచ్చిన అధికారులు సమాచార బోర్డులో తమ పేర్లు నమోదు చేయించలేకపోయారు. ఏపీఎం రామ్మోహన్ 2022 జులైలో బదిలీ అయ్యారు. అదే నెలలో మధుసూదన్ ఏపీఎంగా వచ్చారు. ఆయన ఈ నెల మొదటి వారంలో బదిలీ అయ్యాడు. ఏపీఎంగా రాజశేఖర్ 6న బాధ్యతలు చేపట్టారు. బోర్డులో రామ్మోహన్ పేరు ఉండడం చూసి మహిళలు మళ్లీ అప్పటి సారే వచ్చాడనుకుంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పాత అధికారుల పేర్లు మార్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.